ప్రజాశక్తి

సోమవారం 5 ఫిబ్రవరి 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

చివర్లోనైనా అడుగుతారా?

- నేటి నుంచి అసెంబ్లీ - జిల్లాల్లో సమస్యలకు పరిష్కారం దక్కేనా?
- నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించకుండానే పదవీకాలం ముగింపు!
- మండలిలోనే కీలక అంశాల ప్రస్తావన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్ట నుంది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు వచ్చే నెలలో వెలువడే అవకాశం ఉండటంతో ఈ సమావేశాలు ప్రస్తుత ఎమ్మెల్యేలు చివరి సమావేశాలుగా భావిస్తున్నారు. ఎన్నికల షెడ్యూలు విడుదలైన తేదీ నుంచి ప్రజా ప్రతినిధులు తమ అధికారాలను కోల్పోతారు. చివరి సమావేశాల్లో తమ గళం వినిపించేందుకు ఎంతమంది జిల్లా ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తారో చూడాల్సి ఉంది.

ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలోని 17మంది ఎమ్మెల్యేల్లో నియోజకవర్గాల సమస్యలను ప్రస్తావించిన వారి సంఖ్య చాలా తక్కువే. ప్రభుత్వ విధానాలు, బడ్జెట్ ప్రతిపాదనలు, పలు అంశాలపై జరిగిన చర్చల్లో పాల్గొనడం తప్ప నియోజకవర్గాల్లోని సమస్యలను ప్రస్తావించి నిధులు రాబట్టుకున్న ఎమ్మెల్యే ఒకరిద్దరైనా లేరంటే అతిశయోక్తి కాదు. అయితే శాసన మండలిలో మాత్రం జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్సీలు జిల్లాకు చెందిన అంశాలపై ప్రస్తావించారు. రాష్ట్రానికి చెందిన అంశాలతో పాటు జిల్లాలోని వ్యవసాయ, నీటి పారుదల, విద్యా, వైద్య రంగాలపై సుదీర్ఘంగా మాట్లాడి పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన వారిలో ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు ముందు వరుసలో ఉన్నారు.

2019 మార్చిలో ఎమ్మెల్సీగా గెలిచిన ఆయన గత నాలుగున్నర ఏళ్ల కాలంలో ప్రతి సమావేశంలో కూడా శాసన మండలిలో కీలక అంశాలను ప్రస్తావించారు. వరికపూడిశెల, గుంటూరు ఛానల్, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి, గుంటూరు నగర పాలకసంస్థలో అభివృద్ధి పనుల జాప్యం, యూజిడి, ఆర్‌యుబి, ఆర్‌వోబిల అంశాలతో పాటు మెడికల్ కళాశాల, పాఠశాల దుస్థితి, ఉపాధ్యాయులు కొరత, పాఠశాలల విలీనం నిర్ణయాల వల్ల ఏర్పడిన ఇబ్బందులు, డిఎస్‌సి నోటిఫికేషన్లు, మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రముఖంగా ప్రస్తావించారు. మండలిలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వైసిపి ఎమ్మెల్సీలు రాజకీయ పరమైన లఘు చర్చల్లోనే ఎక్కువగా పాల్గొన్నారు. సమస్యల ప్రస్తావన చాలా తక్కువగానే ఉంటోంది.

సమావేశాలు ఐదురోజులే జరిగే అవకాశం ఉందని అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు భావిస్తున్నారు. పల్నాడు జిల్లాలో వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి సిఎం జగన్ శంకుస్థాపన చేసి రెండు నెలలు అవుతున్నా ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. ఈ అంశంపై ప్రతిపక్షపార్టీలు ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపు పనులు ఇంత వరకు ప్రారంభంకాలేదు. గుంటూరు నగరంలో యూజిడి పనులు నిలిచిపోయి నాలుగేళ్లు దాటినా ప్రభుత్వం ఈ పనులపై దృష్టి సారించలేదు. కాల్వల మరమ్మత్తులు సకాలంలో జరగక జిల్లాలో గత ఖరీఫ్‌లో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఈ ఏడాది రబీ కూడా ముగుస్తున్నా ఇంతవరకు కాల్వల మరమ్మతులపై ఇంతవరకు జలవనరులశాఖ కార్యాచరణ రూపొందించలేదు. రానున్న ఎన్నికల నేపథ్యంలో అయినా కొంత మేరకు పనులు జరుగుతాయని రైతులు ఆశిస్తున్నారు. కానీ నిధులు విడుదల కాకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. పల్నాడు జిల్లాలో మిర్చి పైరుకు నీటి ఎద్దడి ఏర్పడింది. సాగర్ జలాశయంలో నీటినిల్వ తక్కువగా ఉన్నందున ఇప్పట్లో విడుదల చేసే అవకాశంలేదు. దీంతో మిర్చి దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళనలో ఉన్నారు. పంటను కాపాడుకునేందుకు ప్రభుత్వం ఇంత వరకు కార్యాచరణ రూపొందించలేదు.

బుక్‌స్టాల్ వద్ద పుస్తకాలను పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

అభ్యుదయం వైపు నడిపే పుస్తకాలు ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో

- సత్తెనపల్లిలో ప్రారంభించిన జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- 'రాష్ట్రంలో ప్రాజెక్టులు-నీటి వనరులు' పుస్తకాన్ని బహూకరించిన వి.కృష్ణయ్య

4 లో

ఒపిఎస్ సాధన కోసం పోరుబాట : యుటిఎఫ్

8 పేజీ

16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి

రైతు, కార్మిక సంఘాల నాయకుల పిలుపు

5 లో

మాటల్లో హామీ.. కాగితాల్లో అంచనా..

దక్కని మిచౌంగ్ తుపాను పరిహారం - గతేడాది రబీలో నష్టానికీ.... - రైతు భరోసాలోనూ కోత

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు అధికారులు, ప్రజా ప్రతినిధులు హడావుడి చేస్తారు. అన్నివిధాలుగా అదుకుంటామంటూ చెబుతారు. ప్రజాప్రతినిధుల హామీలు మాటలకు.. అధికారుల లెక్కలు కాగితాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. ముఖ్యంగా ఈ విషయంలో రైతులు ఎక్కువగా మోసపోతున్నారు. గతేడాది రబీలో, ఈ ఏడాది ఖరీఫ్‌లోనూ రైతులు తీవ్రంగా నష్టపోయారు. రబీలో అధిక వర్షాల కారణంగా జొన్న, మొక్కజొన్నను దెబ్బతింటే, ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి, మినుముపై మిచౌంగ్ తుపాను తీవ్ర ప్రతాపం చూపింది. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. కనీసం పరిహారం చెల్లిస్తే రబీ పెట్టుబడులకైనా వస్తాయని ఆశించినా అది కూడా దక్కగా దిగాలు పడుతున్నారు.

ప్రజాశక్తి-తెనాలి

2 లో

పట్టించుకోవడం లేదు

వ్యవసాయంలో దాదాపుగా 80 శాతం పైగా కౌలు రైతులే ఉన్నారు. పెట్టుబడులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో అప్పులు చేసి వ్యవసాయం చేయాల్సిందే. ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పంట నష్ట పరిహారం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నాం. రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందికి సమాచారమేమీ లేదని చెబుతున్నారు. కొద్దిమంది రైతులం వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు వెళితే అదిగో..ఇదిగో అంటున్నారే తప్ప పరిహారం మాత్రం చెల్లించటం లేదు. గతేడాది రబీలో నష్టపోయాం. అప్పుడూ పరిహారం రాలేదు.

మేకల చిట్టిబాబు, కౌలు రైతు, తెనాలి

శ్రద్ధాంజలి

కీ॥శే॥ తోకల లక్ష్మీకాంతమ్మ గారు

మరణం : 26-01-2024

మీ చల్లని ప్రేమను మాకు పంచి తిరిగిరాని లోకాలకు వెళ్ళిన మీరు
మా నుండి భౌతికంగా దూరమైనా మీ తీపి జ్ఞాపకాలను మేము మరువలేకున్నాము.
మానవతా విలువలు మాకు అందించిన మీకు అశ్రునయనాలతో నివాళులర్పిస్తూ..

భర్త : తోకల కోటేశ్వరరావు

కుమారులు - కోడళ్లు
తోకల మధుసూదనరావు - నగరాజకుమారి
తోకల వీర నారాయణ - శేషమాంబ
మరియు మనుమలు, మనుమరాండ్రు
లింగారావుపాలెం, యడ్లపాడు మండలం, పల్నాడుజిల్లా.

సంస్మరణ సభ : పల్నాడుజిల్లా, యడ్లపాడు మండలం, లింగారావుపాలెం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో ది. 05-02-2024 సోమవారం ఉదయం 11 గం.లకు జరుగును.

ఆడుదాం ఆంధ్ర విజేతలకు ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తన కార్యాలయంలో ఆదివారం అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ రాణించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. నరసరావుపేట పట్టణంలో 1వ వార్డు చెందిన సయ్యద్ యాకూబ్ వలి టీమ్ వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ విజేతగా నిలిచిన క్రీడాకారులను అభినందించారు.

కృష్ణవేణి జూనియర్ కాలేజీలో ఘనంగా ఫేర్‌వెంట్ వేడుకల

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఫేర్వెల్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా పట్టణ సిఐ సాంబశివరావు, కండ్లగుంట హెచ్ఎం బొడ్డపాటి వరప్రసాద్, పుల్లారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు జీవితం గురించి విలువైన సూచనలు సలహాలు తెలియజేశారు. ఇంటర్ తర్వాత ఎలాంటి కెరియర్ ఎంచుకోవాలో సూచనలు చేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.లింగారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం ప్రారంభించారు. మాచాయపాలెంలో రూ.22 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.29 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.35 లక్షలతో కమ్యూనిటీ హాలు, రూ.34 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. పాపాయిపాలెంలో 1.35 అదనపు గదులు, రూ.40 లక్షలతో సచివాలయం భవనం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం భవనం, రూ.25 లక్షలతో ఆరోగ్య కేంద్రం భవనం, రూ.35 లక్షతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభించారు. మన్నెసుల్తాన్‌పాలెంలో రూ.44 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.22 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.26 లక్షలతో నిర్మించినరైతు భరోసా కేంద్ర భవనం, నాడు నేడు కింద రూ.10 లక్షలతో నిర్మించిన పాఠశాల ప్రహరీని, రూ.16 లక్షలతో వేసిన సిసి రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి చెన్నప్పరెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి, జెడ్‌పిటిసి గాదె వెంకటరెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాటల్లో హామీ.. కాగితాల్లో అంచనా..

దక్కని మిచౌంగ్ తుపాను పరిహారం - గతేడాది రబీలో నష్టానికీ.... - రైతు భరోసాలోనూ కోత

ప్రజాశక్తి-తెనాలి

అష్టకష్టాలు పడి ఆరుగాలం శ్రమించిన రైతన్న నిత్యం సమస్యల ఊబిలోనే కొట్టుమిట్టాడుతున్నాడు. ఓ వైపు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా, మరోవైపు పెట్టుబడులు భారంగా మారుతున్నా ఎలాగోకలా సాగును నెట్టుకొస్తున్నారు. దిగుబడిపై ఆశగా ఎదురుచూసే రైతన్నపై ప్రకృతి విలయతాండవం చేస్తోంది. గతేడాది రబీలో అధిక వర్షాల దాటికి చేతికందిన జొన్న, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఖరీఫ్‌లోనైనా ప్రకృతి కరుణించకపోతుందా? అన్న ఆశతో రైతులు సాగుకు శ్రీకారం చుట్టారు. అయితే వెద పద్ధతిలో వరి సాగు చేసిన రైతులు ప్రారంభంలోనే రెండు విడతలుగా కురిసిన భారీ వర్షాలకు వరి ముంపుకు గురై నష్టపోయారు. తిరిగి ఎలాగో కోలుకుని గాడిన పడిన రైతులు శక్తియావత్తూ కూడగట్టుకుని ముందుకు సాగారు.

ఈ నేపథ్యంలో డిసెంబర్ మొదటి వారంలో వరి కోతకు సిద్ధమైంది. రేపో మాపో పంట చేతికొస్తుంది అనుకుంటున్న తరుణంలో మిచౌంగ్ తుపాను రూపంలో ప్రకృతి విలయతాండవం చేసింది. రైతులను నిలువునా ముంచేసింది. ఏకంగా ఐదు రోజులు కురిసిన భారీ వర్షాలకు కోతకు సిద్ధంగా ఉన్నపైరు, కోసిన పైరు

నందివెలుగులో పంటనష్టంపై రైతులతో మాట్లాడుతున్న చంద్రబాబు (ఫైల్)

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గతేడాది రబీలో దెబ్బతిన్న మొక్కజొన్న

కూడా నీట మునిగింది. అపార నష్టాన్ని చవిచూసిన రైతులకు ఊపిరాడని పిరిస్థతులు ఎదురయ్యాయి. పొలాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి, రైతులను ఆదుకుంటామని, పరిహారం చెల్లిస్తామని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ కూడా ఇచ్చారు. అయితే ధాన్యం కొనుగోలుకు సవాలక్ష ఆంక్షలు విధిచడంతో నష్టాల ఊబిలో ఉన్న రైతు విధిలేని పరిస్థితిలో మరింత నష్టపోయినా దళారులనే నమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిహారం కోసం కూడా రైతు భరోసా కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేదని ఆవేదన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాగితాల్లోనే పంటనష్టం అంచనాలు

తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటల నష్టం అంచనాకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. 33 శాతానికి పైబడి దెబ్బతిన్న పంటలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలంటూ పలు ఆంక్షలు విధించింది. పంట నష్టం అంచనాలకు రంగంలోకి దిగిన అధికారుల గణాంకాల ప్రకారం తెనాలి మండలంలో 10,733 ఎకరాలకు పైగా వరి, 113 ఎకరాల్లో మినుము దెబ్బతింది. కొల్లిపర మండలంలో 6,398 ఎకరాలకుపైగా వరి, 200 ఎకరాల్లో మినుము, దుగ్గిరాల మండలంలో 8893 ఎకరాలకుపైగా వరి, 92 ఎకరాల్లో మినుము దెబ్బతిన్నాయి. పరిహారంగా వరికి హెక్టారుకు (రెండున్నర ఎకరాలు) రూ.17 వేలు, మినుముకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం ప్రతిపాదించింది. వాస్తవానికి ప్రభుత్వం ప్రతిపాదించిన పరిహారం నామమాత్రమే. వరిలో ఎకరానికి ఎంత తక్కువగా చూసినా పెట్టుబడులే రూ.35-40 వేల మధ్య ఉన్నాయి. అయినా ప్రకటించిన పరిహారమైనా దక్కితే కనీసం రబీలో పెట్టుబడులకు ఉపయోగపడతాయని రైతులు భావించారు. ప్రభుత్వం నుంచి నేటికీ పరిహారం ఊసేలేదు.

అందని గతేడాది రబీ పరిహారం.. రైతు భరోసాలోనూ కోత

గతేడాది రబీలో జొన్న, మొక్కజొన్న చేతికొచ్చే సమయంలో భారీ వర్షాలతో పంటలు నీటిపాలై రైతులు తీవ్రంగా నష్టపోయారు. పరిహారానికి అధికారులు అంచాలు వేసినా నేటికీ రూపాయి కూడా దక్కలేదని రైతులు వాపోతున్నారు. రైతు భరోసా కూడా అరకొరగానే అందించారు. రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందిస్తున్న ప్రభుత్వం ఒకదఫా రూ.4 వేలు, అక్టోబరులో రూ.7,500 చెల్లించిన ప్రభుత్వం, డిసెంబర్‌లో రూ.2వేలు చెల్లించాల్సి ఉంది. అది కూడా చెల్లించలేదని రైతులు మొత్తుకుంటున్నారు.

సమస్యలపై ప్రభుత్వాల వైఖరిని చెప్పాలి : సిఐటియు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కార్మికులు, కర్షకులు, స్కీమ్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిర్దిష్టమైన వైఖరి బయటపెట్టాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ డిమాండ్ చేశారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో సిఐటియు పల్నాడు జిల్లా కమిటీ సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయడం, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలు చట్టం తదితర డిమాండ్లతో రైతు, కార్మిక, కర్షక సంఘాల పిలుపు మేరకు ఈనెల 16న జరిగే దేశవ్యాప్త గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమ్మెలో బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు, యూనియన్లు పాల్గొంటాయని అన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుకూలంగా వేతనాలు పెరగక కార్మికులు స్కీం వర్కర్లు అర్థాకలితో అలమటిస్తున్నారని, కార్మికులు, స్కీం వర్కర్లు శ్రమదోపిడీకి గురవుతూ బానిసలుగా పనిచేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. ప్రమాదబరితమైన వాహన ప్రమాదాల చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు, అంగన్వాడీలు మున్సిపల్ కార్మికులు సమ్మె ద్వారా పలు సమస్యలను పరిష్కరించుకున్నారని గుర్తు చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్, నాయకులు జి.మల్లీశ్వరి, డి.శివకుమారి, సిలార్ మసూద్, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

బీసీలను దగా చేసిన వైసిపి ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా, వినుకొండ

అసమర్థ పాలనలో రాష్ట్రంలో బీసీలు తీవ్రంగా నష్టపోయారని, బీసీలను దగా చేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జమిందార్ ఫంక్షన్ హాలులో, వినుకొండ పట్టణంలోని ఎంపిడీవో కార్యాలయం వద్ద న్యాయవాది సైదారావు అధ్యక్షతన జయహోబీసీ కార్యాక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కొల్లు రవీంద్ర, జీవీ ఆంజనేయులు మాట్టాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 75 మంది బీసీలను పొట్టన పెట్టుకుందని, 2500 మంది బీసీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టించిందని దుయ్యబట్టారు. 56 బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకుండ మోసం చేసిందన్నారు. బీసీ రిజర్వేషన్లు 10 శాతం తగ్గించి ద్రోహం చేశారన్నారు. రిజర్వేషన్ తగ్గింపుతో రాష్ట్రవ్యాప్తంగా 16 వేల పదవులకు బీసీలు దూరమయ్యారని వివరించారు. రూ.75 వేల కోట్ల బీసీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి బీసీలకు తీరని అన్యాయం చేసిందని, ప్రభుత్వం పనులు చేసిన బీసీలకు బిల్లులు నిలిపివేయటమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది బీసీ భూములను దౌర్జన్యంగా ఆక్రమించారని ఆరోపించారు. రాష్ట్రంలో 'జె' బ్రాండ్లతో రూ.వేలకోట్లు దోచుకున్న జగన్‌రెడ్డి 3200 మంది ప్రాణాలను బలి తీసుకోవటమే కాక 35 లక్షల మంది అనారోగ్యానికి కారకుడయ్యాడని విమర్శించారు. వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు అనేకమంది బీసీలపై దాడులు చేయించడం అక్రమ కేసులు బనాయించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే దుర్మార్గానికి దాసి సుబ్బారావు అనే వ్యక్తి బిల్లులు నిలిపివేయడంతో మానసికంగా కంగిపోయి అప్పుల పాలై మరణించారని చెప్పారు. రానున్నది టిడిపి-జనసేన సంయుక్త ప్రభుత్వమని, బీసీలకు పెద్దపీట వేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. టిడిపి అధికారంలోకి రాగానే బీసీ రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి బీసీలకు అండగా ఉంటామన్నారు. టిడిపి నరసరావుపేట నియోజకవర్గం ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, నాయకులు ఎన్.రామచంద్ర ప్రసాద్, టి.చంద్రశేఖర యాదవ్, జి.నాగేశ్వరరావు, పి.సైదారావు, జి.రామకృష్ణ, హనుమంతు రాజు పాల్గొన్నారు.

వినుకొండలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కొల్లు రవీంద్ర, ఇతర నాయకులు

టిడిపి గెలిస్తే సంక్షేమ పథకాలు అందవు : రావెల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వచ్చే ఎన్నికలల్లో టిడిపి, జనసేన గెలిస్తే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందక తీవ్రంగా నష్టపోతారని మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు అన్నారు. గుంటూరులోని వైసిపి కార్యాల యంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అవినీతి లేని సంక్షేమ పథకాలను సిఎం జగన్ గత నాలుగున్నర ఏళ్లుగా అందిస్తుంటే ఉన్నతవర్గాలు ఓర్వలేకపోతున్నాయని అన్నారు. ఈ సారి ఎన్నికలు పేదలకు, పెత్తందారి వ్యవస్థకు మధ్య జరుగు తున్నాయన్నారు. సమాజంలో అసమానతలు తగ్గాలంటే పేదలకు ప్రభుత్వంనుంచి సంక్షేమపథకాలు అందాల్సిందేనని అంబేద్కర్ ఆనాడే చెప్పాడన్నారు. వైసిపి పాలనలో 120 సంక్షేమ పథకాల ద్వారా రూ. 2.55 లక్షల కోట్లు 70 శాతంమంది ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేసిం దన్నారు. పేదలకు సంక్షేమం ద్వారా వారు ఆర్థికంగా నిలదొక్కు కోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఒక వైపు సంక్షేమంతో పాటు విద్య,వైద్య, వ్యవసాయరంగాలను సిఎంజగన్ అభివృద్ధి చేస్తున్నారని అన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు

పేదల పిల్లలుచదువుకు దూరం కాకుండా అమ్మఒడి వంటి కీలక పథకాలు రాష్ట్ర విద్యారంగంలో ఎన్నోమార్పులకు దారి తీసిందన్నారు. ఎస్.సి.ఎస్.టి. బి.సి. మైనార్టీ మహిళల సంక్షేమ కోసం చేయూత పథకం ద్వారా నాలుగేళ్లలో రూ.75వేలు అందించారని అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్యం ఉచితంగా అందుతుందన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి దుగ్గిరాల

కోర్బ (చతిస్గడ్) నుండి త్రివేంద్రం వెళుతున్న నెంబర్ 22 647 కొచ్చువెల్లి స్పెషల్ ట్రైన్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగినది. దుగ్గిరాల చిలువూరు స్టేషన్ల మధ్య అత్యంత వేగంగా వస్తున్న ఎక్స్‌ప్రెస్ ట్రైన్ గుర్తుతెలియని వృద్ధుడిని ఢీకొనగా వృద్ధుడి శరీరం క్రింద భాగం పూర్తిగా విడిపోయినది. పైభాగం ఇంజన్ ముందు ఇరుక్కుపోయినది. ఇది గమనించిన డ్రైవర్ దుగ్గిరాల స్టేషన్‌లో బండిని ఆపి మిగిలిన సగం భాగం వృద్ధుడి శరీరాన్ని ఇంజన్ నుండి తొలగించారు. వృద్ధుడికి షుమారు 70 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

మనస్థాపంతో భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి దుగ్గిరాల

భార్యకు క్యాన్సర్ ఫైనల్ స్టేజ్ అని తెలిసి మనస్థాపం చెంది భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. దుగ్గిరాల పోలీసులు తెలిపి వివరాల ప్రకారం విజయవాడ గుణదలకు చెందిన వీరమనేని రామకృష్ణారావు (57) సీతానగరం వద్ద డెల్టా ప్రధాన కాలువ బకింగ్ హామ్ కెనాల్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పొడ్డాడు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా కాలువ గట్టుపై అతని ద్విచక్ర వాహనం, చరవాణి, చెప్పులు లభించాయి. దీనితో కాలువలో పడి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని వెతుకుతుండగా ఆదివారం మృతదేహం మండలంలోని తుమ్మపూడి గ్రామ సమీపంలో కనుగొన్నారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దుగ్గిరాల రైటర్ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేసు న్నారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు. అతనికి ఇటీవల పెళ్లి సంబంధం కుదిరినట్లు తెలిసింది. ఇంతలోనే ఇటువంటి ఘటన జరగ టంతో ఆ ఇంట్లో విషాదం అలుముకుంది.

GENERAL NOTICE

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE : GUNTUR

S.O.P. No. 95 / 2023

Between:

Meesala Jhansi Rani, W/o.Ruben,2)Meesala Kiran, S/o.Ruben, 3)Meesala Chaitanya, S/o.Ruben, 4) 2)Meesala Sandya,D/o. Ruben. All are R/o. #34-18-831, 18th Line, Sarada Colony, Guntur. ...Petitioners

And

1)Suvartha, W/o. Not Known to the petitioner, 2) Jeevan Kumar, S/o. Not Known to the peititoner, 3) M. Naresh, Not Known to the petitioner, all are R/o. #14-336, Ambedkar Colony, Krishna Nagar, Tadepalli Town & Md, Guntur Dist., 4) A.P. Police Department Rep. by. Superintendent of Police, Guntur Urban, Guntur City & Guntur Dt. .....Respondents

పైనెంబరు యస్.ఓ.పి.ని పిటీషనర్లు 1వ వారికి భర్త, 2 నుండి 3వ వార్లకు తండ్రిగారైన మీసాల రూబెన్ గారు పోలీసు హెడ్ కానిస్టేబుల్‌గా(H.C. No. 107) 4వ రెస్పాండెంటు వద్ద పనిచేస్తూ మరణించిన దరిమిలా అతనియొక్క డెత్ బెనిఫిట్స్ అయిన పి.ఎఫ్. వగైరాలు ఆర్-4 వద్ద నుండి పొందుటకు పిటీషనర్ల పేరుతో వారసత్వ సర్టిఫికేట్ ఇప్పించమని కోరుతూ పిటీషన్ దాఖలుచేయగా సదరు పిటీషన్‌పై ఎవరికైనా అభ్యంతరములు ఉంటే తెలుపుకొన వలసినదిగా కోరుచూ శ్రీ కోర్టువారు జనరల్ నోటీసు నిమిత్తం **దీ.13-03-2024**కి వాయిదా వేసినారు. కావున వాయిదారోజున **ఉ॥గం॥10-30ని॥**లకు అభ్యంతరములు ఉన్నవారు పైకోర్టువారి ఎదుట స్వయంగా గాని, లేక వారి తరపు ప్లీడరుగారి ద్వారా గాని హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల శ్రీ కోర్టువారిచే చట్టప్రకారం తీర్మానించబడును. (శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది : **13-03-2024.**

యన్. వరప్రసాద్, యస్. రామకృష్ణ, , పిటీషనర్ తరపు అడ్వకేట్స్

3/14 బ్రాడీపేట, గుంటూరు. సెల్: 9550395955

కెఎల్‌యు యువ వ్యాపారవేత్తల సదస్సుకు హాజరైన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

కే ఎల్ డిమ్డ్ యూనివర్సిటీలో యువ వ్యాపార వ్యవస్థాపకుల సదస్సును శనివారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాదు, చెన్నై బెంగళూరు లలో నూతనంగా వ్యాపారాలు స్థాపించిన కేఎల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులందరూ పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరైన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి పార్థసారథి వర్మ , రిజిస్టర్ డాక్టర్ కె సుబ్బారావు మాట్లాడుతూ కే ఎల్ వర్సిటీలో విద్యను అభ్యసించిన తమ విద్యార్థులు తమ కాళ్ళ మీద నిలబడి వ్యాపారాలను స్థాపించడం ఆనందదాయకం అన్నారు. పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ శ్రీ కావ్య మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమాఖ్య వారు నిర్వహించిన ఈ యువ వ్యాపార వ్యవస్థాపకుల సదస్సుకు పూర్వ విద్యార్థులందరూ హాజరు కావడం తమకు ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థుల విభాగం నుండి విద్యార్థులకు మేలు చేసే కార్యక్రమాలను భవిష్యత్తులో మరిన్ని చేపడతామని తెలియజేశారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అమరావతి బోటింగ్ క్లబ్ వ్యవస్థాపకులు విద్యార్థి తరుణ్ కాకాని మాట్లాడుతూ కేఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఎన్నో కొత్త ఆలోచనలకు కొత్త సౌకర్యాలకు నాంది పలికారు అన్నారు. అనంతరం సదస్సు హాజరైన నూతన వ్యాపార వ్యవస్థాపకులు యూనివర్సిటీతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. నూతన వ్యాపారాలను స్థాపించాలనుకునే విద్యార్థులకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్ వెంకట్రామ్ , రిజిస్టర్ కే సుబ్బారావు, అసిస్టెంట్ డైరెక్టర్ సోనీ, సీనియర్ మేనేజర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సిఐగా బాధ్యతలు చేపట్టిన సురేష్

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల రూరల్ సిఐగా కె.సురేష్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో పామూరులో పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు సజావుగా నిర్వహిస్తానని, లా అండ్ ఆర్డర్ సమస్యలు రాకుండా చూస్తామని అన్నారు. ప్రజలకు తమకు సహకరించాలని కోరారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమ చేతులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మంగళకరము 2024 జెమ్ ఎమ్ కె 1 ప్రోస్టేటిక్ హ్యాండ్ పేరిట నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టుకు ఆదివారం మంగళగిరి నగరంలోని ఆత్మకూరు పరిధిలో గల డాక్టర్ గోలి నాగసేనరావు తోటలో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అన్నే రత్న ప్రభాకర్, రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షులు అందే రేవంత్, సెక్రెటరీ గాజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ, గత డిసెంబర్ నెలలో ఎల్ ఎన్ 4 కృత్రిమ చేతుల పంపిణీ ప్రాజెక్ట్‌ను విజయ వంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది మే 19 నుంచి 26 వరకు నగరంలోని వీ టి జే ఎం అండ్ ఐ వి టి ఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో పూర్తిస్థాయి హ్యాండ్ ప్రాజెక్టు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్మనీలో తయారైన అధునాతన పూర్తి కృత్రిమ చేతులను అవసరమైన వారికి ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఈ అవకాశాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి సేవలను పలువురు ప్రశంసించారు. రోటరీ క్లబ్ సభ్యుడు గుంటి నాగరాజు జన్మదినోత్సవ వేడుకలను రోటరీ ప్రతినిధులు నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు అందే రేవంత్, మురళీమోహన్, ఆరేపల్లి నిరంజన్ గుప్తా, డాక్టర్ మాజేటి వంశీకష్ణ, ప్రగడ రాజశేఖర్, వడ్లమూడి శ్రీనివాసరావు, క్రాంతి కుమార్, రావెల శ్రీనివాసరావు,ఉడతా శ్రీనివాసరావు, ప్రగడ అజయ్, జవ్వాది కిరణ్ చంద్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో కాపుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న కాపు, తెలగ, బలిజ ఉద్యోగస్తులు, రిటైర్డు ఉద్యోగస్తుల ఆత్మీయ సమావేశం ఆదివారం స్థానిక ఫర్టిలైజర్స్ కల్యాణ మండపంలో జరిగింది. సమావేశానికి కాపు జెఎసి దక్షిణ భారత కన్వీనర్ దాసరి రాము అధ్యక్షత వహించారు. ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలని, ఒకరికి ఇబ్బంది వచ్చినా వెంటనే మిగతా వారు ఆదుకోవాలని సమావేశంలో పలువురు వక్తలు సూచించారు. అన్ని శాఖాలలో ఉద్యోగులకు మధ్య పరస్పర సహకారం తో కాపుల్లోని పేదలను ఆదుకోవాలని కోరారు. త్వరలో కాపునాయకులతో కలిసి కాపుఉద్యోగుల సమన్వయ కమిటీ సమావేశంనిర్వహించాలని నిర్ణయించారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు అన్నిజిల్లాల ఉద్యోగులు హాజరు అయినట్టు దాసరి రాము తెలిపారు. వివిధ సంఘాల నాయకులు సోమరౌతు రామకృష్ణ, పోల్లా నారాయణ, డి శ్రీనివాస్, పి పోలేశ్వరరావు , జి వేలాంగి రాజు తదితరులు ప్రసంగించారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న దాసరి రాము

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - అచ్చంపేట

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలైన సంఘటన అచ్చంపేట మండలం పరిధిలోని సంద్ర తండా వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. తాడువాయి గ్రామం నుండి సంద్ర తండాకు వెళుతున్న వ్యవసాయ ట్రాక్టర్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనంపై ముగ్గురు విద్యార్థులకు బలంగా ఢీ కొట్టింది. ఈ క్రమంలో గుంటూరులోని కే సి రెడ్డి కళాశాలలో చదువుతున్న రాజశేఖర్ కాలుకు తీవ్ర గాయం కాగా మరో ఇరువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరు పులిచింతల ప్రాజెక్టును సందర్శించేందుకు వెళుతున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వీరిని 108 వాహనం ద్వారా సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గంజాయి రవాణా ముఠా అరెస్టు

10 కిలోల సరుకు స్వాధీనం

ప్రజాశక్తి నాదెండ్ల

గంజాయి రవాణా చేస్తున్న ముఠాను చిలకలూరిపేట పోలీసులు అరెస్టు చేసి, వారివద్ద నుండి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం ఖైరతాబాద్ చింతల బస్తికి చెందిన ఉల్లాస్, గుండవాడ ఒడిస్సా రాష్ట్రానికి చెందిన గులారి శంకర్, విశాఖపట్నం జిల్లాకు చెందిన రెడ్డిగుణశేఖర్ ముగ్గురు విశాఖ జిల్లా సీలేరులో గంజాయిని కొనుగోలు చేసి విక్రయిస్తున్నారని సమాచారంతో మండలంలోని గణపవరం చవితి పాలెం వద్ద అరెస్టు చేసినట్లు తలిపారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి దుగ్గిరాల

మండలంలోని ఈమని గ్రామంలో ఆదివారం వైసిపి, జనసేన కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో ఇరు గ్రూపులకు చెందిన నలుగురు గాయపడి ఆసుపత్రిలో చేరినట్లు తెలిసినది. సేకరించిన వివరాల ప్రకారం మండల వైఎస్ఆర్సిపి మాజీ అధ్యక్షుడు ఎడ్ల సాయి కృష్ణ తన అనుచరులతో జనసేన పార్టీలో చేరేందుకు ఊరేగింపుగా మంగళగిరి వెళ్లడానికి బయలు దేరారు. ఈ క్రమంలో ఈమనీ చుక్కపల్లి వారి పాలెం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్తలు ద్విచక్ర వాహనాలకు పార్టీ జెండాలు కట్టుకొని హారన్‌లు కొడుతు తిరిగారు. ఊరేగింపు హై స్కూల్ వద్దకు వచ్చిన అనంతరం ఇరుపక్షాల వారి మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది . ట్రైనీ డిఎస్పి ఇన్చార్జ్ ఎస్ఐ పి గీతాకుమారి, మంగళగిరి రూరల్ సిఐ వెంకట్రావు, బదిలీపై వచ్చిన ఎస్ఐ ప్రతాప్ కుమార్ ఈమని గ్రామానికి వెళ్లి విచారించి గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

చల్లపల్లి విజయ్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - చేబ్రోలు

ఆదివారం లారీ కిందపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన చేబ్రోలు గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో జి బి సి రోడ్డుపై చోటు చేసుకుంది. చేబ్రోలు ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం నారాకోడూరు గ్రామం నుండి చేబ్రోలు మీదుగా మోదుకూరు బైక్ వెళ్ళుచున్న యువకుడు కారును ఢీ కొట్టి కింద పడిపోవడంతో యువకుని వెనక నుండి వస్తున్న లారీ అతని పైనుంచి తొక్కుతూ వెళ్లడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడు చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన చల్లపల్లి విజయ్ (24)గా గుర్తించారు. ఘటనకు సంబంధించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓట్ ఫర్ ఓపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సిపిఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణపై రాజకీయ పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఓపీఎస్‌ను అమలు చేసిన వారికే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను స్థానిక పండరిపురంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని గత ఎన్నికలప్పుడు హామీనిచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి తర్వాత దాన్ని విస్మరించారని, కొత్తగా జిపిఎస్ విధానం తెచ్చారని అన్నారు. ఇది ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఏమాత్రమూ ప్రయోజనం కాదన్నారు. జిల్లా కార్యదర్శి కె.తిరుపతిస్వామి మాట్లాడుతు సిపిఎస్ రద్దు కోసం పోరాటంలో భాగంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కె.స్నేహలత, వి.నాగమల్లేశ్వరరావు, ఎం.ఉమామహేశ్వరరావు, ఎం.చంద్రశేఖరరావు, ఎ.చెన్నకేశవ, పి.పాపయ్య, టి.సత్యనారాయణ, టి.సుధాకర్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలో ఎఎమ్ రెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థులు

అవగాహనతోనే కేన్సర్‌ను తరమికొట్టాలి

ఎఎమ్ రెడ్డి ఫార్మసీ కాలేజీ కార్యదర్శి శాంతి శ్రీనివాసరెడ్డి

కేన్సర్‌పై అవగాహన కోసం విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అవగాహనతోనే కేన్సర్ మహమ్మారిని తరిమికొట్టాలని ఎఎమ్ రెడ్డి ఫార్మసీ కళాశాల కార్యదర్శి అట్లూరు శాంతి శ్రీనివాసరెడ్డి అన్నారు. అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవ సందర్భంగా నరసరావుపేట మండలంలోని పెట్లూరువారిపాలెం గ్రామ పరిధిలోగల ఎఎమ్ రెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ వినుకొండ రోడ్డులోని బస్టాండ్ కూడలి వద్ద నుండి మల్లమ్మ సెంటర్ మీదుగా పురపాలక సంఘం కార్యాలయం వరకు కొనసాగింది. ర్యాలీని ప్రారంభించిన శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సౌందర్య సాధనాలైన వివిధ రకాల క్రీములు వలన చర్మ క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లతో కేన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ జీవన శైలిలో మార్పులు చేసుకోవడం, తరచుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్లను ముందుగానే గుర్తిస్తే 40 శాతం కేన్సర్ మరణాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. కేన్సర్‌కు కారణమయ్యే కలుషిత ఆహారం, పురుగు మందుల అవశేషాలున్న పంటలకు దూరంగా ఉండాలని, ఆరోగ్య వంతమైన ఆహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భార్గవ భూషణ్‌రావు, అకాడమిక్ డీన్ డాక్టర్ ఎం.లక్ష్మీ సురేఖ, విభాగాధిపతి డాక్టర్ కిరణ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యుదయం వైపు నడిపే పుస్తకాలు ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో

- సత్తెనపల్లిలో ప్రారంభించిన జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- 'రాష్ట్రంలో ప్రాజెక్టులు-నీటి వనరులు' పుస్తకాన్ని బహూకరించిన వి.కృష్ణయ్య

మంత్రి అంబటి రాంబాబుకు పుస్తకాన్ని బహూకరిస్తున్న వి.కృష్ణయ్య


ప్రజాశక్తి బుక్‌హౌస్ ఆవిష్కరణ సభలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక విలేకరుల కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ప్రజాశక్తి బుక్‌హౌస్‌ను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు మార్కెట్లో అనేక షాపుల్లో దొరుకుతాయని, కానీ సమాజాన్ని అభ్యుదయం వైపు నడిపించే పుస్తకాలు మాత్రం ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో దొరుకుతాయని చెప్పారు. ప్రజాశక్తి సాహితీ సంస్థ చైర్మన్ వి.కృష్ణయ్య మాట్లాడుతూ సెల్‌ఫోన్లు, టీవీలు ఎన్ని ఉన్నా పుస్తకాల్లో ఉండే సమాచారానికి సరిపడవన్నారు. అనే అంశాల్లో వాస్తవాలు, పూర్వాపరాలు తెలియాలంటే పుస్తకాల్లో సమాచారం సమగ్రంగా ఉంటుందని చెప్పారు. ప్రపంచంలోనే నలుమూలల్లోని 200 దేశాల్లోని అనుభవాలను ప్రపంచానికి తెలియచెప్పేది పుస్తకాలేనని, అటువంటి అమూల్యమైన సమాచారానికి ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, ప్రజాశక్తి చీఫ్‌జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, జనరల్ మేనేజర్ జి.శివరామకృష్ణయ్య, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పి.సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో మళ్లీ అధికారంలోకి రావటానికి మతతత్వ శక్తులు, కార్పొరేట్ శక్తులు సమాజంలో అనేక అరాచకాలు, అక్రమాలకు పాల్పడుతున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు అవసరమైన విజ్ఞాన, సమాచార సాధనం పుస్తకమని, వాటిని అందించే ప్రజాశక్తి బుక్‌హౌస్ అవసరం సమాజానికి ఎంతో ఉందని అన్నారు. సభలో అతిథులను సాహితీవేత్త డాక్టర్ సరికొండ రమాదేవి సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ చలంచర్ల లక్ష్మి తులసి సాంబశివరావు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, ప్రజాశక్తి బుక్‌హౌస్ విజయవాడ మేనేజర్ బి.శ్రీనివాస్, ప్రజాశక్తి సత్తెనపల్లి డివిజన్ ఇన్‌ఛార్జి ఎన్.కృష్ణ, నరసరావుపేట ఇన్‌ఛార్జి ప్రేమ్‌సాగర్, సర్క్యులేషన్ ఇంచార్జి ఆంజనేయులు, ప్రజాసంఘాల నాయకులు కె.శివదుర్గారావు, ఎ.వీరబ్రహ్మం, జె.రాజ్‌కుమార్, ఎ.వెంకట్ నారాయణ, జి.రజని, ఎస్.వెంకటేశ్వర్లు, టి.రాము పాల్గొన్నారు.

కంటికీ కేన్సర్ వచ్చే అవకాశం

డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి ఎం.వి రెడ్డి కంటి హాస్పిటల్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఎముక గొంతు లివర్ క్యాన్సర్లతో పాటు కంటికి కూడా కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని, దీనిపై ప్రజల్లో అవగాహన చాలా తక్కువగా ఉంటుందని ఎంవి రెడ్డి కంటి హాస్పిటల్ అధినేత డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. కంటి కేన్సర్ త్వరితగతిన నిర్ధారించి చికిత్స చేయించకపోతే ఒక కంటి నుంచి మరో కంటికి, ఇతర శరీర భాగాలకు వ్యాపిస్తుందని చెప్పారు. కంటి రెప్పలు వాపు రావడం, కంటి ఉపరితలంపై వాపు గడ్డ ఉన్నట్లు గమనిస్తే నిర్లక్ష్యం చేయకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం వలనే కేన్సర్ వ్యాధి సంక్రమిస్తుందని, రసాయనాలు లేని ఆహారం తీసుకోవడం ద్వారా కేన్సర్ నుండి రక్షించుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. ప్రాణాంతక వ్యాధిగా మారిన కేన్సర్ మహమ్మారిని పారదోలేందుకు ప్రతిఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు.

సర్వ కళల సమాహారమే బుర్రకథ

- ప్రజల అవసరాలను తీరిస్తేనే ఏ కళకైనా మనుగడ
- బుర్రకథ అధ్యాపకులు షేక్ బాబూజి
- పల్నాడు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పదర్శన, వర్క్‌షాప్

బుర్రకథ పితామహుడు పద్మశ్రీ షేక్ నాజర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాబూజీ, బాలోత్సవ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సర్వ కళల సమాహారమే బుర్రకథని, ప్రజల అవసరాలు తీరిస్తేనే ఏ కళకైనా మనుగడ ఉంటుందని బుర్రకథ అధ్యాపకులు, కళారత్న షేక్ బాబూజి అన్నారు. బుర్రకథ పితామహుడు పద్మశ్రీ షేక్ నాజర్ 124 జయంతి సందర్భంగా పల్నాడు బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ట్రైనీటాట్స్ కిండర్‌జాయ్ పాఠశాలలో బుర్రకథలపై వర్క్‌షాప్ ఆదివారం జరిగింది. బాబూజి మాట్లాడుతూ బావి భారత పౌరులకు సంస్కృతి కళారూపాలు అందించేందుకు బాలోత్సవాల కమిటి చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. పిల్లలు స్వచ్ఛమైన తెలుగు భాష మాట్లాడాలంటే కళలు, సంస్కృతీ సంప్రదాయాలను అలవర్చాల్సిన అవసరం ఉందన్నారు. కళారూపాలు, సాహిత్యాలు, ఆడడం, పాడడం ద్వారా మనసు స్థిరత్వానికి, జ్ఞాపకశక్తి పెరగడానికి దోహదం చేస్తుందని వివరించారు. నేటి యువత జీవన విధానానికి కళలను తోడు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అప్పుడవి మానసిక ఉత్తేజాన్ని, ప్రశాంతతను కలిగిస్తాయని, హాస్యం, సంస్కృతి, సంప్రదాయాలు, రాజకీయం, పాటలు ఆనందం ఇముడింప చేస్తాయని, పరభాషలు నేర్చుకునేందుకు కళలు దోహదం చేస్తాయని వివరించారు. కథాగాన కళారూపాల ద్వారా ప్రజలు కొత్త ఆలోచనలతో తమ సమస్యల పరిష్కారానికి మార్గాలు కనిపిస్తాయన్నారు.

బాలోత్సవాల కమిటీ అధ్యక్షులు, ఆక్స్‌ఫర్డ్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ గతేడాది నిర్వహించిన బాలోత్సవాల్లో 62 రకాల కళారూపాలు ప్రదర్శన చేపట్టగా బుర్రకథకు సంబంధించి తక్కుమంది విద్యార్థులు వచ్చారని, దీన్ని పరిపూర్తి చేయడానికి వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. పల్నాడు బాలోత్సవం ద్వారా ప్రతినెలా ఒక కార్యక్రమం నిర్వహించి సంస్కృతి, సంప్రదాయాలు, కళల పట్ల విద్యార్థులలో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ బుర్రకథల కళారూపం పునరుద్ధరణ జరగాలంటే ప్రజల అవసరాలకు అనుగుణమైన ఇతివృత్తాలతో ముందుకెళ్లాలన్నారు. జానపద కళారూపాలను బతికించుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు గుర్తించాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో కళలకు సంబంధించిన సిద్ధాంత గ్రంథాలకు, సిద్ధాంతకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలు, కళాకారులను తయారు చేసే, శిక్షణ కోసం ఉద్దేశించిన గ్రంథాలు తయారు చేసే వారికి ప్రోత్సాహం లభించడం లేదని తెలిపారు. ఏ కళకైనా సిద్ధాంత పరమైన గ్రంథాలు ఎన్ని ఉన్నా దాన్ని నేర్పే విధానం తెలియకపోతే నిరుపయోగమన్నారు. బాలబాలికలు అభ్యుదయ భావాలతో కూడిన ఇతివృత్తాన్ని ఎంచుకొని, బుర్రకథలను సాధన చేస్తే మేడే రోజున బుర్రకథ మేళాను నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ మేళాకు బాలబాలికలు అంతా సన్నద్ధం కావాలని, పాల్గొనే వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ గౌరవాధ్యక్షులు ఎం.ఎస్‌ఆర్.కె ప్రసాద్, పల్నాడు బాలోత్సవం కమిటీ సభ్యులు కె.రామారావు, ఎం.సాంబశివరావు, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, టి.అంజిరెడ్డి మాస్టారు, టి.యోహాన్ రాజు, ఎస్.రామిరెడ్డి, కె.శివపార్వతి, బి.సలీం, ట్రైనిటాట్స్ డైరెక్టర్ పి.కోటేశ్వరమ్మ, చినఓబయ్య, ఏసుదయ పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి

రైతు, కార్మిక సంఘాల నాయకుల పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు
దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 16వ తేదీన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం గుంటూరు, బ్రాడీపేటలోని పిఎల్‌రావు భవన్‌లో రైతు, కార్మిక సంఘాల సమావేశం జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి హనుమంతరావు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఉల్లిగడ్డల నాగేశ్వరావు, కిసాన్ ఫెడరేషన్ జిల్లా నాయకులు కాల్వ శ్రీధర్ రావు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు మేకలరవి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, భారత్ బచావో జిల్లా నాయకులు నవజ్యోతి, మున్సిపల్ వర్కర్ నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు, కార్మిక, సామన్య ప్రజలపై భారాలు మోపుతున్న బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలనే పిలుపుతో ఈనెల 16వ తేదీ గ్రామీణ బంధు, పారిశ్రామిక సమ్మెను కేంద్రంలోని రైతు సంఘాలు, కార్మిక సంఘాలు ఉమ్మడిగా పిలుపునివ్వడం జరిగిందన్నారు. రైతులు, కార్మికులు, విద్యార్థి, యువజనులు, మహిళలు పెద్ద సంఖ్యలో బంద్‌లో పాల్గొనాలని కోరారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని వాగ్ధానం చేసి వ్యసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగిస్తుందని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థలు బ్యాంకుల్లో తీసుకున్న రూ.13 లక్షల కోట్లను రద్దు చేసిందన్నారు.కానీ రైతులకు ఉన్న రూ.4.5 లక్షల కోట్లు రద్దు చేయటానికి ప్రభుత్వానికి చేతులు రావట్లేదన్నారు. కేరళ రాష్ట్రం తరహాలో రుణ విమోచన చట్టాన్ని తీసుకురావాలని తీసుకురావాలన్నారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి, వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించటానికి ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో 175 చట్టాలను

గుంటూరులో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నా నాయకులు

తీసుకువచ్చారన్నారు. ఇప్పటికే కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు ఏపీ అమలు చేయలేదని అన్నారు. రాష్ట్రాన్ని ద్రోహం చేసిన బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలో అధికార వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు లొంగిపోయాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్ : కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. ఆదివారం ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కె.బి భవన్ లో రైతు, కౌలు రైతు, కార్మిక సంఘాల సమావేశం నాయకులు పల్లె కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో శివశంకరరావు మాట్లాడుతూ వ్యవసాయ, పారిశ్రామిక రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర బిజెపి, నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 16న నిర్వహించే బంద్, సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతు, కార్మిక రంగ వ్యతిరేక చట్టాలకు జరుగు బంద్‌ను జయప్రదం చేసేందుకు, అన్ని వర్గాల ప్రజలు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, ఆయా ప్రజా సంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కష్ణ, సిఐటియు నాయకులు వడ్డేశ్వరం పున్నయ్య, మహిళా సంఘం తాడేపల్లి మండల అధ్యక్షురాలు కారసాల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జొన్నా శివశంకర్

భారీ ర్యాలీతో మంగళగిరికి బాలశౌరి

పవన్ సమక్షంలో జనసేనలో చేరిక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరి ఆదివారం జనసేనపార్టీలో చేరారు. ఆయన గుంటూరు నుంచి పోటీ చేయాలని ఆలోచిస్తున్నట్టు తెలిసింది.టిడిపి,జనసేన పొత్తులో గుంటూరు నుంచి ఎంపిగా పోటీకి ఆయన ఆసక్తి చూపు తున్నట్టు తెలిసింది. అయితే టిడిపి గుంటూరు సీటును తామేపోటీ చేస్తామని బాలశౌరికి మచిలీపట్నం ఇచ్చేందుకు సిద్ధపడినట్టు సమా చారం. ఈ అంశంపై ఉండవల్లిలోని చంద్రబాబునాయుడు నివాసం ఆదివారం రాత్రి చర్చలు జరిగాయి. టిక్కెట్ల వ్యవహారం ఇంకా ఖరారు కాలేదని పార్టీ వర్గాలు తెలిపాయి. మంగళగిరి లోని జనసేన కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో బాలశౌరి భేటి అయ్యారు. పార్టీ కండువా కప్పుకున్న తరువాత ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఇప్పుడు జనసేనలో ఒక కార్యకర్తనని, తాను ఎక్కడ నుంచిపోటీ చేయాలన్నదీ పవన్ కల్యాణ్ నిర్దేశిస్తారని తెలిపారు. బాలశౌరితోపాటు ఆయన కుమార్డు అనుదీప్‌కూడా జనసేనలో చేరారు. అంతకు ముందు గుంటూరులోని కృష్ణనగర్ నుంచి భారీ ర్యాలీగా ఆయన మంగళగిరి జనసేన కార్యాలయానికి తరలివెళ్లారు. స్థానిక లాడ్జి సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెద్దసంఖ్యలో జనసేన కార్యకర్తలు ర్యాలిలో పాల్గొన్నారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షులు నేరెళ్ల సురేష్, పార్టీ జిల్లా నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకులుగా టిడిపి నేతలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : టిడిపి నాయకులు అభివృద్ధి నిరోధకులుగా మారారని ఎమ్మెల్యే ముస్తాఫా ఆరోపించారు. స్థానిక ఆనంద్‌పేటలో ఆదివారం రాత్రి జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు గుంటూరులో ఎటువంటి అభివృద్ధి చేయకుండా ఇష్టం వచ్చినట్టు రోడ్లను తవ్వేశారని, గత నాలుగున్నర ఏళ్ల కాలంలో నగరంలో అభివృద్ధిపనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. తమ హయంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టిడిపి నాయకులు తమపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా టిడిపి నుంచిపలువురు వైసిపిలో చేరినట్టు ముస్తాఫా ప్రకటించారు. వైసిపి తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా నేతత్వంలో గుంటూరు ఈస్ట్ యువజన నగర అధ్యక్షులు సూరజ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆనంద్ పేట ప్రాంతంలో తెలుగు యువత ముఖ్య నాయకులు ఏజస్, రహీం , అబుసర్ , సోను ,వసీం , ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా వైసిపి కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. సమన్వయకర్త నూరి ఫాతిమా మాట్లాడుతూ పార్టీలో జాయిన్ అయిన ప్రతీ ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో యువత అంతా కలిసికట్టుగా జగన్మోహన్ రెడ్డిని సీఎం చేసేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంజుమాన్ గుంటూరు అధ్యక్షులు కర్నూమ, వైసిపి జనరల్ సెక్రెటరీ గులాం రసూల్, స్థానిక కార్పొరేటర్ అభిద్, వైసీపీ ముఖ్య నాయకులు బషీర్ భాయ్, కళ్ళం హరికష్ణ రెడ్డి,గౌస్, పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్పులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు : పచ్చిపులుసు రామకుమారి ఎనిమిదో వర్థంతి సందర్భంగా స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై పచ్చిపులుసు రఘువరావు, రామకుమారి ఎండోమెంట్ స్కాలర్‌షిప్పులను గుంటూరు చలమయ్య డిగ్రీ కాలేజి విద్యార్థులకు అందచేశారు. అనంతవరం వేదవతి భాగవతారణిచే భక్త మార్కండేయ హరి కథను ప్రదర్శించారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు చిటిపోతు మస్తా నయ్య, పచ్చిపులుసు రాఘవరావు, పచ్చిపులుసు ప్రభావతి, విజయశంకర్, వాణిసతీష్, డాక్టర్ లక్ష్మీసునీత, ఆదినారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శేఖర్‌ను అభినందిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ తదితరులు

కనుమూరి శేఖర్‌కు జెడ్పీ ఛైర్‌పర్సన్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు
గుంటూరు జిల్లా పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కనుమూరి శేఖర్‌కు ఆదివారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా ముఖ్య అతిథి పాల్గొని శేఖర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఇఒ ఎన్ఎస్‌విబి వసంతరాయుడు, ఎంపిడిఒ బండి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కూచిపూడి మోహనరావు, జెడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

8న ఆశాల చలో విజయవాడ

జయప్రదం కోసం విస్తృత సమావేశం

ప్రజాశక్తి - మేడికొండూరు
ఆశావర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మేడికొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా యూనియన్ మండల అధ్యక్షురాలు ధనలక్ష్మీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో నేతాజీ మాట్లాడుతు ఆశాలు కడు పేదవర్గం నుండి వచ్చారని, జీవితానికి భద్రత ఉంటుందని పనిభారం పెంచినా, ఇబ్బందులు ఎదుర్కొంటు పనిచేస్తున్నా రన్నారు. ప్రభుత్వం వారిపై 24 గంటల పని భారం పెంచి కనీస వేతనం అమలు జరపకుండా బెదిరించుతూ పని చేయిస్తుందన్నారు. వారికి వచ్చే రూ.10వేల వేతనం నుండే వారివిధుల నిర్వహణకు, స్టేషనరీ, రవాణా ఇంకా ఇతర ఖర్చులు కలిపి నెలకు రూ.3000 నుండి రూ.4000 ఖర్చు చేస్తూన్నా రన్నారు. అందువలన వారికి కనీస వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్‌లు, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, డ్యూటీలో మరణించిన వారికి ఎక్స్ గ్రేసియా10 లక్షలు ఇవ్వాలని ,రాజకీయ జోక్యము ఉండకూడదని తదితర సమస్యలను పలు మార్లు ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. సమస్యలు పరిష్కరించుకోవడానికి 8వ తేదీన చలో విజయవాడ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొట్ల రామకృష్ణ, వెంకాయమ్మ, సులోచన, ఉమాదేవి, పద్మ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

టిడిపితోనే బీసీలకు న్యాయం

మాట్లాడుతున్న సుందరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి
బిసిల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ అన్నారు. ఆదివారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ వచ్చిన తరువాతే బిసిలకు సరైన గుర్తింపు వచ్చిందని చెప్పారు. ఆర్థిక, సామాజిక చైతన్యం కూడా బిసిలకు టిడిపి వచ్చిన తరువాతే వచ్చిందని చెప్పారు. బిసి రిజర్వేషన్ బిల్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో పెట్టకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో తెలుగు యువత కార్యదర్శి తాడిబోయిన భాస్కర్ పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్ను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

మంగళగిరిలో 11నుండి వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి మంగళగిరి
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి పట్టణంలోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణం (బోగి ఎస్టేట్స్)లో ఫిబ్రవరి 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మంగళగిరి వాలీబాల్ లీగ్-3 టోర్నమెంట్ నిర్వహించ నున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య తెలిపారు. సన్నాహక సమావేశం నిర్వహించి టోర్నమెంట్ విశేషాలతో కూడిన వాల్‌పోస్టర్‌ను నియోజకవర్గ తెలుగుయువత ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నందం అబద్దయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని క్రీడాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో నారా లోకేష్ టోర్నమెంట్స్ నిర్వహిస్తు న్నారని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పడవల మహేష్, ప్రధాన కార్యదర్శి కొప్పుల మధు, ఉపాధ్యక్షులు మన్నం అశోక్, పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి కందుల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - రెంటచింతల

మహిళల ఆర్థిక అభివృద్ధి తమ ధ్యేయమని, వారు బాగుంటే కుటుంబమంతా సంతోషంగా ఉంటుందని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఇది గుర్తించే మహిళల సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోందని చెప్పారు. ఆదివారం మండల కేంద్రమైన రెంటచింతలలోనే సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల ఆవరణలో నాలుగో విడత ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ పేర్ల చౌడమ్మ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసరా నిధులతో ఆదాయం వచ్చే పనులను చేపట్టాలని సూచించారు. 738 గ్రూపులకు చెందిన 7380 మందికి రూ.7.22 కోట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సొంటిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపిపి డి.చౌడేశ్వరి, వైసిపి మండల కన్వీనర్ గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ కన్వీనర్ రామయ్య, ఏరువ ప్రతాప్‌రెడ్డి, అల్లం ప్రతాప్‌రెడ్డి మాజీ జెడ్‌పిటిసి భాస్కర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, జి.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసిపికి ఓటమి తప్పదు

టిడిపి డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చంద్రబాబు నిర్వహిస్తున్న కదలిరా సభలకు వస్తున్న ప్రజాదరణ చూసి వైసిపికి ఓటమి భయం పట్టుకుందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదని టిడిపి డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజాసంక్షేమాన్ని ధ్వంసం చేసిన వైసిపికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. జగన్ ఎన్నికలకు ముందే ఓటమిని అంగీకరించారని, సొంత పార్టీ మంత్రులను ఎమ్మెల్యేలను కలిసేందుకు కూడా ఇష్టపడని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఎద్దేవ చేశారు. 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తానని హామీ ఇచ్చి జాబ్‌లెస్ క్యాలెండర్‌తో నిరుద్యోగ యువతను మోసం చేశారని, రాజధాని లేని రాష్ట్రానికి చెందిన యువత ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో ఉండే యువత ఆంధ్రులమని చెప్పుకోవాలంటే సిగ్గు పడాల్సిన పరిస్థితిని వైసిపి తెచ్చిందని దుయ్యబట్టారు. ఎన్నికల్లో యువత చైతన్యవంతంగా ఆలోచించి టిడిపిని గెలిపించాలన్నారు.

టైలర్స్ అసోసియేషన్‌లో పట్టణ వాసులు

ప్రజాశక్తి - వినుకొండ

పల్నాడు జిల్లా టైలర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి వినుకొండ పట్టణం, నియోజకవర్గము నుండి టైలర్లు పిడుగురాళ్లకు భారీ ర్యాలీగా వెళ్లారు. వినుకొండ పట్టణము నుండి కోశాధికారిగా ఎమ్‌డి. ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడిగా సిహెచ్ గోవిందరాజులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వదిపాటి కాశీ వెంకటాచారి, జాయింట్ సెక్రెటరీగా ఎస్కే సైదా ఎన్నికయ్యారు.

అభివృద్ధిలో పులివెందులకు పోటీగా గురజాల

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పులివెందులకు పోటీగా గురజాల నియోజకవర్గం అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని జానపాడు రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ జానపాడు రోడ్డు రైల్వే ఓవర్ బ్రిడ్జి 50 ఏళ్ల నాటి కల అని, ఇప్పుడు అది వైసిపి ప్రభుత్వంలో నెరవేరబోతుందని చెప్పారు. మరో 18 నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. గతంలో ఈ మార్గం ద్వారా వెళ్లాలంటే రైల్వే గేటు పడి సుమారు గంటకు పైగా వేచి చూడాల్సి వచ్చేదని, బ్రిడ్జి పూర్తయితే ఆ సమస్య ఉండబోదని అన్నారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల జానపాడులో భూములు ధరలు కూడా పెరుగుతాయని అన్నారు. 2019 ముందు గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి మాటే లేదని, కనీసం వైద్య సదుపాయాలు కూడా అందుబాటులో లేవని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో 600 పడకల హాస్పిటల్ నిర్మించబోతున్నామని, పిడుగురాళ్ల ప్రధాన సమస్య అయిన బైపాస్‌ను ఈ నెలలో ప్రారంభించబోతున్నామని వివరించారు. పిడుగురాళ్ల పట్టణంలో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లో నిర్మించామని, గురజాలలో చరిత్ర కలిగిన దుబా చెరువును అభివృద్ధి చేశామని, పిడుగురాళ్ల చెరువు కూడా అభివృద్ధి చేయబోతున్నామని చెప్పారు. నియోజకవర్గంలో ఇంజినీరింగ్ కాలేజీ కూడా నిర్మించబోతున్నామని, గురజాలలో అగ్రికల్చర్ కాలేజీ నిర్మాణానికి కృషి చేస్తున్నామని చెప్పారు. పిడుగురాళ్ల పట్టణంలో ప్రతి ఇంటికీ కృష్ణా నీరు అందిస్తున్నామని, పదివేల ఇళ్లకు పూర్తి చేశామని, మరో ఎనిమిది వేల ఇళ్లకు త్వరలో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ టీజీవి కృష్ణారెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ ఆర్.శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు, వైస్ చైర్మన్ కె.ముక్కంటి, జయలుద్దీన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కె.వెంకటేశ్వర్లు, వైసిపి పట్టణ అధ్యక్షులు సిహెచ్.రామారావు, నాయకులు బి.ఎల్లారావు, ఎం.సుధీర్, జి.పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వేల ఎకరాల ఆక్రమణ

మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు

విలేకర్లతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పిడుగురాళ్లలో రామలింగేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో ఉన్న దేవాదాయ భూమిని వైసిపి నాయకులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారి అక్రమాలకు హద్దు లేకుండా పోతోందని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్‌రావు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండల పరిధిలోని కోనకిలో 9 ఎకరాల ప్రభుత్వ భూమిని మాజీ జెడ్‌పిటిసి వీరభద్ర రామిరెడ్డి, విఆర్ఒ సత్యారెడ్డి, డాక్యుమెంట్ రైటర్ లింగారెడ్డి కలిసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భూ ఆక్రమణలు జరుగుతున్నాయని, భూమిని గుర్తించేది ఒకరు, అందుకు ధ్రువపతాలు ఏర్పాటు చేసేది ఒకరు, ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించేది ఒకరు, ఇలా ఒక్కొక్కరు ఒక్కొక్క పని ఎంచుకొని ప్రభుత్వ భూములను కాజేస్తున్నారని అన్నారు. గురజాల నియోజకవర్గంలో మొత్తంగా 3 వేల ఎకరాలను కాజేసి బ్యాంకులలో తనకా పెట్టి రుణాలు కూడా తెచ్చుకుంటున్నారని ఆరోపించారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమిని విజయసాయి సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో సూపర్వైజర్‌గా పనిచేస్తున్న ఊటుకూరు శివగోవింద్‌రెడ్డి పేరు మీద మారుస్తున్నారని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భూములపై విచారణ చేసి సంబంధిత అధికారులు, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియోజకవర్గంలో 33 ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ చేస్తున్నారని అన్నారు. మహేష్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యాక హత్యలు, దాడులు పెరిగాయని విమర్శించారు. ఒకట్రెండు నెలల్లో ఎన్నికలు జరగబోతుంటే కాసు మహేష్‌రెడ్డి రైల్వే ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన అంటూ టెంకాయలు కొడితే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ప్రజల సహకారంతో గురజాల నియోజకవర్గంలో ఏడో సారి తాను పోటీ చేయబోతున్నానని, జనసేన టిడిపి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడబోతుందని అన్నారు. టిడిపి, జనసేన కలిసి గురజాలకు ఉమ్మడి మేనిఫెస్టోను రూపొందించబోతున్నామని తెలిపారు.

సిపిఎస్ రద్దు హామీనిచ్చి మోసం చేసిన జగన్

వరికపూడిశెల నిర్మాణం హామీ ఏమైంది? : జూలకంటి బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - కారంపూడి

టిడిపిలో చేరిన వారితో జూలకంటి బ్రహ్మారెడ్డి

అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తానని హామీనిచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి అనంతరం ఉద్యోగులను తీవ్రంగా మోసం చేశారని టిడిపి మాచర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి విమర్శించారు. కారంపూడి పట్టణంలోని సుద్దగుంతల కాలనీకి చెందిన పలువురు వైసిపి నుండి టిడిపిలో చేరిన సందర్భంగా నిర్వహించిన సభలో బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు సంపూర్ణ మద్యపాన నిషేధం అని చెప్పి మాట తప్పిన వ్యక్తి జగన్ కాదా అని ప్రశ్నించారు. నా ఎస్సీలు నా ఎస్టీలు నా బీసీలు నా మైనార్టీలు అంటూనే ఆయా కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేశారని, నిధులను దారి మళ్లించారని విమర్శించారు. వరికపూడిశెల పూర్తి చేసి తిరిగి ఎన్నికలకు వస్తానని గత ఎన్నికలప్పుడు చెప్పిన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇప్పుడు ఏం సమాధానమిస్తారని అన్నారు. శంకుస్థాపన చేసి మూణ్ళెల్లయినా పనులు ప్రారంభించలేదన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యే అవకాశం ఇచ్చినా చేసిన అభివృద్ధి శూన్యమని, తనకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తానని అన్నారు. భూ కబ్జాదారుల ఆట కట్టించి పేదల ఆస్తులకు రక్షణ కల్పిస్తానని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు యు.లక్ష్మీనారాయణ, నాయకులు పి.అంజయ్య, జి.సురేష్ యాదవ్, సిహెచ్.రాము, బి.శ్రీనివాసరావు, పి.పుల్లయ్య, కె.బాలకృష్ణ, జి.నాగేశ్వరరావు, టి.రత్తయ్య, మస్తాన్‌జాని, శ్రీనివాసరావు, బాలూ నాయక్, పేరయ్య, రామారావు, రవి పాల్గొన్నారు.

గ్రామాలకే ప్రభుత్వ వైద్య సేవలు : ఎమ్మెల్యే

నల్లగార్లపాడులో విలేజ్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - రొంపిచర్ల

రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడ్డారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలో నల్లగార్లపాడులో ఆదివారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఘన స్వాగతం లభించింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి పాలనలో గ్రామంలో రూ.2.60 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు వస్తే గతంలో పట్టణాలకు వెళ్లేవారని, వైపిపి హయాంలో గ్రామాల్లోనే విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని చెప్పారు. గ్రామంలో సిసి రోడ్డు, డ్రెయినేజీలు, జలజీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలు నిర్ణయించిన వారికే దక్కేవని, జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయం సాధించి, జగన్ మరలా మరలా ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కె.శ్రీనివాసరెడ్డి, నాయకులు పి.రవీంద్రబాబు, కె.వెంకయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణానికి సాయం

ప్రజాశక్తి - అచ్చంపేట : మండల పరిధిలోని పెదపాలెంలో విద్యుద్ఘాతంతో డి.నాగరాజు ఇళ్లు దగ్ధమైన నేపథ్యంలో బాధిత కుటుంబానికి స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.75 వేలతో రేకుల ఇంటి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. మన్నెం భద్రయ్య మాట్లాడుతూ ఇంటి నిర్మాణం కోసం ఫౌండేషన్ వారు రూ.75 విలువ చేసే ఇటుకలు, రేకులు, ఇనుము, సిమెంట్ కట్టలు, సిమెంట్ పోల్ అందించారని చెప్పారు. ఖర్చుల నిమిత్తం రూ.25 వేల చెక్కును అందించారన్నారు. కార్యక్రమంలో ఎన్.వెంకటయ్య, సిహెచ్.నరసింహారావు, స్నేహ హస్తాలు కో-ఆర్డినేటర్ టి.కరిముల్లా బాబు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - రొంపిచర్ల : మండలంలో సంతగుడిపాడు జెడ్‌పి పాఠశాలలో ఆదివారం 1979-80 విద్యాసం వత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళన జరిగింది. 45 ఏళ్ల తరువాత కలుసుకొన్న పూర్వ విద్యార్థులు ఆనాడు పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరవేసుకొని సరదగా గడిపారు. మైదానంలో వారు ఆడిన ఆటలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పి తాము ఈ స్థాయికి రావడానికి కారకులైన ఆనాటి ఉపాధ్యాయులు కురుగంటి పిచ్చిరెడ్డి, కె.వి.శివయ్య, కళ్లం కృష్ణారెడ్డి, ఎస్.రాధాకష్ణమూర్తి, ఎస్.కె.మహబూబ్, కె.వీరరాఘవయ్యను సన్మానించారు. పూర్వ విద్యార్థులు పొలిమేర వెంకటరెడ్డి, ఎస్.కె.మొహిద్దీన్, నల్లబోతు శివశంకర్, ఆదినారాయణ, వెంకటప్పయ్య, మామిళ్లపల్లి అప్పారావు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో రాణిస్తున్న మహిళలు

ఆసరా 4వ విడత చెక్కుల పంపిణీలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ప్రజాశక్తి - తాడికొండ

వ్యాపార రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని ప్రత్తిపాడు శాసనసభ్యులు, తాడికొండ నియోజకవర్గ ఇన్చార్జి మేకతోటి సుచరిత అన్నారు. తాడికొండ బిఎస్ఎసిబి జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సుచరిత ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ మం డలంలో 1262 డ్వాక్రా సంఘాలకు గడిచిన మూడు విడతల్లో రూ.32 కోట్ల 36 లక్షలు రుణమాఫీ చేయటం జరిగిందన్నారు. నాలుగవ విడతలో రూ. 10 కోట్ల 79 లక్షలను రుణమాఫీ చేశామన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను పేదలకు అందజేస్తుందన్నారు. గడచిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో మండల అభివృద్ధికి రూ396 కోట్ల ఖర్చు చేశారన్నారు. కరోనా సమయంలో మహిళలను ప్రభుత్వం ఆదుకుందని, మూడు ఉచిత గ్యాస్ లు అంటూ మాయమాటలు చెప్పే పార్టీలను నమ్మవద్దన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి గుడిమెట్ల జ్యోతి, ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచి తోకల సరోజిని తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి

టిడిపి నేత నారా లోకేష్, గుంటూరు పార్లమెంట్ తెలుగుయువత అధికార ప్రతినిధి కందుల నాగార్జున సంయుక్త సహకారంతో మంగళగిరి పట్టణంలోని 10 మంది చిరువ్యాపా రులు, ఒక ఎలక్ట్రిషియ న్‌కు ఆదివారం మంగళగిరి పట్టణంలోని 11వ వార్డు పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద తోపుడు, టిఫిన్ బళ్లు, ఎలక్ట్రానిక్ సామాన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు, పద్మశాలి సాధికాత సమితి సభ్యులు బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

టిడిపి నేత లోకేష్, టీడీపి ప్రాతూరు గ్రామ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాస్ సంయుక్త సహకారంతో పరిధిలోని ప్రాతూరు టిడిపి కార్యాలయం వద్ద లబ్దిదారులకు తోపుడు బండి, బడ్డీకొట్టు, సెలూన్ చైర్ అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అమరా సుబ్బారావు,ప్రాతూరు గ్రామ రవపల్లి శ్రీనివాస్, ప్రాతూరు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యలను అశ్రద్ధ చేయొద్దు

ప్రజాశక్తి-గుంటూరు

మన శరీర ఆరోగ్యానికి కిడ్నీల అవసరం, ప్రాముఖ్యత గురించి అర్థం చేసుకొని, ఆ వ్యాధుల విషయంలో అశ్రద్ధ చేయొద్దని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వరలక్ష్మీదేవి అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో కిడ్నీ సంబంధిత వ్యాధులపై ఆరోగ్య సభ జరిగింది. ఈ సభకు సంస్థ సీనియర్ సభ్యులు కళ్యాణ చంద్ర అధ్యక్షత వహించారు. ఈ సభలో శ్రీ హాస్పిటల్ కన్సల్టెంట్ డాక్టర్ వరలక్ష్మీదేవి మాట్లాడుతూ శరీరానికి గుండె, మెదడు, ఊపిరితిత్తులు ఎంత ముఖ్యమో మూత్రపిండాలు కూడా అంతే ముఖ్యమన్నారు. పిడికిలంత సైజులో చిన్నగానే ఉన్నా మూత్రపిండాలు లేకుండా మనం ఎక్కువకాలం బ్రతకలేమన్నారు. శరీరంలోని మిగతా అవయవాలన్నీ తమకు తాము సక్రమంగా పనిచేయటానికి మూత్ర పిండాల మీదనే ఆధారపడతా యన్నారు. రక్తాన్ని వడబోయటం, శరీరంలో నీటిని సమతుల్య స్థితిలో ఉంచటం, మలినాల్ని బయటకు పంపటం, బిపిని నియంత్రించటం, ఎర్రరక్త కణాల తయారీకి, ఎముకల పుష్టకోసం కిడ్నీలు పనిచేస్తాయన్నారు.

ఆరోగ్య సభలో మాట్లాడుతున్న డాక్టర్ వరలక్ష్మి

కిడ్నీల నిర్మాణానికి, కిడ్నీ పనితీరుని మార్చి వేసి, కిడ్నీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మూత్రంలో మంట, మాటిమాటికీ మూత్రానికి పోవటం, వీపు కిందభాగంలో నొప్పి, హైబిపి లాంటివి కిడ్నీ వ్యాధుల లక్షణాలు అని తెలిపారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టరుని సంప్రదించి, తగిన చికిత్స తీసుకోవాలన్నారు. వృద్ధులు ఆహారం విషయంలో జాగ్రత్తలు, మార్పులు తీసుకోవాలని, వారికే ఎక్కువగా కిడ్నీ సమస్యలు వస్తాయన్నారు. సభలో సంస్థ సీనియర్ సభ్యులు వి.వి.రావు, భావన్నారాయణ ప్రసంగించారు.

ఆలపాటి పెళ్లి కానుక అందజేత

ప్రజాశక్తి - తెనాలి రూరల్ :రాజకీయలకు అతీతంగా నిర్వహిస్తున్న ఆలపాటి పెళ్లి కానుక నేటికీ కొనసాగుతూ జనాదరణ పొందింది. పార్టీలకు, మతాలకు అతీతంగా నిర్వహిస్తున్న పెళ్లికానుక కార్యక్రమం ఆదివారం తెనాలి మండలం కఠెవరం గ్రామానికి చెందిన గొట్టిముక్కల వెంకటేశ్వర్లు, రాజేశ్వరి దంపతుల కుమార్తె వేంకటరమణ అలాగే తెనాలి పట్టణ 17వ వార్డుకు చెందిన పఠాన్ అమీనా కుమార్తె షాహినా వివాహాలు సందర్భంగా వారి రువురికి ఉంగరాలు బహుకరించారు. ఆలపాటి పంపిన పెళ్లి కానుకతో పాటు చీర, సారే లు సంప్రదా యంగా పార్టీ వర్గాలు అందించారు. కార్యక్రమంలో కఠెవరం సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, కౌన్సిలర్ అన్నం పిన్నారావు, జొన్నాదుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బిసి ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

ప్రజాశక్తి మంగళగిరి

ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాలకు గుర్తింపునిచ్చినట్లే,బీసీ ఉద్యోగ సంఘాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తింపు నివ్వాలని, సంఘ నాయకుల అభ్యర్థన మేరకు అన్ని సంస్థల డిపార్టుమెంట్లలో పనిచేసే బీసీ ఉద్యోగుల సమస్యలన్నింటినీ సత్వరమే పరిష్కరించడానికి ప్రభుత్వాలతో పాటు, ఉన్నతాధి కారులంతా సమన్వయంతో కృషి చేయాలని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రాష్ట్ర కార్యాలయంలో సంఘం అధ్యక్షులు గుంటుపల్లి ఉమామహేశ్వర రావు అధ్యక్షతన సమావేశంలో నిర్వహించారు. సమావేశంలో కేసన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల వలెనే బిసి అభ్యర్థుల ఉద్యోగ నియామకాలలో బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి, భర్తీ చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఏళ్ల తరబడి అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న బీసీ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, అన్ని డిపార్టుమెంట్‌లలో పదోన్నతులు కల్పించాలన్నారు. బిసి ఉద్యోగుల్లో ఉన్న సామాజిక అభద్రతను తొలగించి,ఉద్యోగ భద్రతను కల్పించాలని శంకరరావు డిమాండ్ చేశారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే క్రాంతి కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి బోనాల మారుతి గోవింద ప్రసాద్, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, ప్రధాన కార్య దర్శి డి శ్రీనివాసరావు,నియోజకవర్గ అధ్యక్షులు వుడతా శ్రీని వాసరావు, బీసీ నాయకులు ఆలా శివాజీ, తిరువీధుల కిరణ్, కాత్రు ధనుంజయ్, జంజనం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల ఉద్యోగుల నాయకులను కేశన శంకరరావు తదితరులు

అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు కేటాయించాలి

దేవాంగుల సంక్షేమ సంఘం సదస్సులో నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది దేవాంగుల ఓట్లు ఉన్నాయని, రాజకీయంగా తగిన ప్రాధాన్యతను ప్రధాన రాజకీయ పార్టీలు ఇవ్వడం లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డీకే నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మంగళగిరి ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో దేవాంగ ఆత్మ గౌరవ సభకు అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు బల్ల వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం, అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మంగళగిరి ఎన్నారై జంక్షన్ వద్ద ఉన్న చేనేత సర్కిల్ బైపాస్, ఎన్నారై, పాత మంగళగిరి సీతారాముల వారి కోవెల మీదుగా ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్ వరకు దేవాంగ ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సదస్సులో నాగరాజు మాట్లాడుతూ రాజకీయంగా బలపడటం ద్వారానే దేవాంగుల సమస్యలు పరిష్కరించబడతాయన్నారు. దేవాంగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ, పొన్నూరు మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ సజ్జా హేమలత మాట్లాడుతు ప్రధాన రాజకీయ పార్టీలు దేవాంగులను ఓటు బ్యాంకు గానే చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇచ్చాపురం నుండి ధర్మవరం వరకు ప్రతి

దేవాంగుల ఆత్మగౌరవ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు డీకే నాగరాజు

నియోజకవర్గంలోనూ దేవాంగుల ఓట్లు పదివేల నుంచి 15 వేల 15 వేల ఓట్లు వరకు ఉన్నాయని, చీరాల నియోజకవర్గంలో సీటును కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇవ్వని పక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తామన్నారు. అదేవిధంగా రాజమండ్రి రూరల్, పుట్టపర్తి అసెంబ్లీ స్థానాలతో పాటు హిందూపురం ఎంపీ సీటును కూడా కేటాయించాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం మూడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానాలను ఏ రాజకీయ పార్టీ ఇస్తుందో ఆ పార్టీ వెంటే నడుస్తామన్నారు. ఆత్మగౌరవ సభలో బీరక ప్రసాదు, ఆకాశపు స్వామి, నక్కిన రాజశేఖర్, నక్కిన విజయలక్ష్మి , ఏరాసు అరుణ బాబు, ఆనెం ఆనంద కుమార్ , పులి రామచంద్ర , గిద్దలూరి ఎర్ర స్వామి, సజ్జ వెంకటేశ్వరరావు, అల్లక తాతారావు, నక్కిన దొరబాబు అల్లక తాతారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేస్తున్న సురేష్‌కుమార్ తదితరులు

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మానవ సేవా సంస్థ విద్యార్థినీ విద్యార్థులకు నిరుద్యోగు లకు విద్యారంగంలో సేవ చేయాలనే ఉద్దేశంతో ఉచితంగా సాఫ్ట్వేర్ కోర్సులో శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉచితంగా కోర్సు నేర్చుకున్నటువంటి విద్యారినీ విద్యార్థులకు మంగళగిరిలోని మానవ సేవా సంస్థ కార్యాల యంలో 60 మందికి ఉచితంగా సాఫ్ట్వేర్ శిక్షణకు సంబంధించిన మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంగర సురేష్ కుమార్ మాట్లాడుతూ మానవ సేవా సంస్థ ద్వారా మార్చి 23న కొత్తగా బ్యాచ్ స్టార్ట్ అవుతుందని తెలిపారు.

ముస్లిములు రాజకీయ చైతన్యం కలిగి ఉండాలి

ప్రజాశక్తి మంగళగిరి

మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళగిరి ఈద్గా షాది ఖానాలో ఆదివారం సమితి రాష్ట్ర కార్యదర్శి మరియు మంగళగిరి ఆంజుమన్ అధ్యక్షులు షేక్ అక్రమ్ అధ్యక్షతన రాజకీయ చైతన్య సదస్సు జరిగింది. సదస్సులో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షిబ్లి, జమియత్ ఉలేమా ఏపీ కన్వీనర్ మౌలానా హుస్సేన్ మజాహరి, సమితి లీగల్ సెల్ అధ్యక్షులు ఎండీ సలీం పాషా మరియు సమితి సలహాదారులు, మానవతా సందేశ సమితి రాష్ట్ర అధ్యక్షులు మౌలానా మక్బూల్ అహ్మద్ నద్వి ప్రసంగించారు. రాష్ట్ర ప్రజలు మరి ముఖ్యంగా ముస్లింలు రాజకీయ చైతన్యంతో సిద్ధంగా ఉండాలి అని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ముస్లింలు అభిమానంతో కాదు అవగాహనతో ముందుకి సాగాలని, తమ ఓటును ఆ విధంగా ఉపయోగించాలి అని కోరారు.

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, జడ్‌పి చైర్‌పర్సన్ హేనీ క్రిస్టీనా

సామాజిక ఆరోగ్యకేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కొల్లిపర

ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వము ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని జిల్లా పరిషత్ చైర్పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టిన అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కొల్లిపరలో రూ 8.72 కోట్ల వ్యయంతో నిర్మించిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్ర నూతన భవన సముదాయాన్ని శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి చెందుతుందన్నారు. శాసనసభ్యులు అన్నా బత్తుని శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి ఇస్తున్న ప్రాధాన్యత ఇస్తున్నది అనేందుకు కొల్లిపరలో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం నిలువెత్తు దర్పణం అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో గ్రామీణ ప్రాంతమైన కొల్లిపరలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మాంచామన్నారు. నూతనంగా నిర్మించిన సామాజిక ఆర్థిక కేంద్రంలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది మౌలిక వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఉమా రెడ్డి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి సుబ్రహ్మణ్య రాజు, వైద్యశాలఅభివృద్ధి కమిటీ సభ్యులు కారుమూరి శ్రీనివాస్ రెడ్డి, బొమ్మ రెడ్డి ప్రభాకర్ రెడ్డి వైద్యాధికారిణి సుజాత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ హత్యకు కారకుల్ని శిక్షించాలి

విఆర్ఎ అసోసియేషన్

ప్రజాశక్తి-గుంటూరు

విజయనగరం జిల్లా, బండపల్లి మండల తహశీల్దారు ఎస్.రమణయ్య దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా గౌరవాధ్యక్షులు వడ్డే బాజీబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.నాగుల్‌మీరా, కోశాధికారి పి.జయపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూ ఉద్యోగులకు, అధికారులకు, విఆర్ఎలకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోతుందన్నారు. భూమాఫియా విచ్చలవిడిగా చెలరేగిపోవటం వల్లనే ఇటువంటి దారుణాలు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి భూమాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ అధికారులు ఉద్యోగులకు, విఆర్ఎలకు పూర్తి భద్రత కల్పించాలని కోరారు. తహశీల్దార్ రమణయ్య హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రమణయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆటో నగర్ మెయిన్‌రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్, కమిషనర్, ఎమ్మెల్యే తదితరులు

మణిపురం వంతెన నుండి జాతీయరహదారి వై జంక్షన్ వరకు షుమారు 3.5 కిలోమీటర్ల బిటి రోడ్ ని నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్.క్యాప్) నిధుల నుండి రూ.3 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులను ఆదివారం మంగళదాస్ నగర్ వద్ద మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత అనేక ఏళ్ల నుండి గోతుల రోడ్డు వలన విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం నూతన బిటి రోడ్డును 15 రోజుల గడువులోగా పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్దం చేశామని తెలిపారు. ఎమ్మెల్యే మట్లాడుతూ వార్డుల వారీగా ఏళ్ల తరబడి గత పాలకులు నిర్లక్ష్యం చేసిన మౌలిక వసతులను ప్రస్తుతం ప్రభుత్వంలోనే చేపట్టడం జరిగిందన్నారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ కేంద్రం నిధులైన ఎన్.క్యాప్ ద్వారా జిల్లా కలెక్టర్, చైర్మన్ ఆమోదంతో నగరంలో సుధీర్ఘ కాలంగా నుండి పెండింగ్‌లో ఉన్న ప్రధాన రహదారుల పునరుద్ధరణ చేపట్టామన్నారు. నగర ప్రజలు ఎన్నో ఏళ్ల నుండి ప్రధాన రహదారులలో గుంతల వలన ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు శాశ్వత పరిష్కారం, నగరంలో వాతరావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎండ్ టు ఎండ్ రోడ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.12 కోట్ల ఎన్.క్యాప్ నిధులతో నగరంలో ప్రదానమైన జెకెసి కాలేజి రోడ్, పెద్ద పలకలూరు రోడ్డుకు గతేడాది పనులు చేపట్టడం జరిగిందని, ప్రస్తుతం పెద్ద కాకాని రోడ్, పొన్నూరు రోడ్, నందివెలుగు రోడ్, చుట్టగుంట జంక్షన్, ఎత్తు రోడ్ జంక్షన్, బ్రాడిపేట4 వ లైన్, రెడ్డిపాలెం మెయిన్ రోడ్ నుండి ఆదిత్య నగర్ 1వ లైన్ వరకు నూతన రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివద్ధి పనులను ఎస్.ఈ., ఈ.ఈ.లు నేరుగా నాణ్యతా ప్రమాణాలు పాటించేలా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ(ఎఫ్ఏసి) సుందర్రామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, వైసిపి నాయకులు నూరి ఫాతిమా తదితరులు పాల్గొన్నారు. .

ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

కృష్ణా రివర్ క్రాస్ ఈత పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఈత పోటీల్లో పాల్గొన్న స్విమ్మర్లు, బహుమతులు పొందిన విజేతలు

ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 24వ కృష్ణానది రివర్ క్రాస్ ఈత పోటీలు నిర్వహించారు. విజయవాడ దుర్గా ఘాట్ నుంచి అమరావతి కరకట్ట వరకు 1.5 కిలోమీటర్ల ఈత పోటీల్లో వివిధ వయసుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం ఆరు కేటగిరీలుగా విభజించారు. 433 మంది ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని నిర్వాహకులు చెప్పారు. పురుషులతో సమానంగా ఆరు కేటగిరీల్లో 66 మంది మహిళలు పాల్గొన్నారని వివరించారు. అనంతరం అమరావతి కరకట్ట రోడ్డులోని ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ లైఫ్ చైర్మన్, మాజీ ఎంపి గోకరాజు గంగరాజు, దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ డైరెక్టర్ డివి మధుసూదరావు, భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎంఎస్‌కె ప్రసాద్, లైలా గ్రూప్ కంపెనీస్ డైరెక్టర్ గోకరాజు ఆదిత్యవర్మ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి కూడా ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. నదిలో పోటీలు జరిగే సమయంలో ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా డిజాస్టర్ సర్వీస్ ఫైర్ డిపార్టుమెంట్ 50 మంది రెస్క్యూ టీమ్ అప్రమత్తంగా ఉండి తమ సేవలందించారని తెలిపారు. అనంతరం రాష్ట్ర ఎన్‌డిఆర్ఎఫ్ ఫైర్ డిపార్టుమెంట్ రెస్క్యూ టీమ్ గుండెపోటు ప్రమాదం జరిగినప్పుడు, ఎవరికైనా హార్ట్ స్ట్రోక్ వచ్చినప్పుడు సిపిఆర్ చేయడం ద్వారా వారి ప్రాణాలు రక్షించే పద్ధతిని డెమోగా చేసి చూపించారు. అలాగే ఆహారం తీసుకునే సమయంలో గొంతులో అడ్డం పడినట్లు అయితే దాన్ని తీసే విషయంలో ఆలస్యం చేయకుండా తీసే పద్ధతిని చేసి చూపించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ, కార్యదర్శి ఎంఎల్ నరసరాజు, కన్వీనర్ అమ్మిరెడ్డి రామిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఒపిఎస్ సాధన కోసం పోరుబాట : యుటిఎఫ్

దశలవారీ ఆందోళన, ప్రచారానికి కార్యాచరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రేమ్ కుమార్, విజయసారధి తదితరులు

పాత పెన్షన్ సాధన కోసం మరో పోరు బాటకు యుటిఎఫ్ సమాయత్త మైందని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రేమ్ కుమార్, జి విజయ సారధిలు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో జిల్లా యుటిఎఫ్ కార్యాల యంలో ఆదివారం ఓట్ ఫర్ ఓపిఎస్ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్, విజయ సారధి మాట్లా డుతూ పాత పెన్షన్ సాధన కోసం రాష్ట్రం లో అనేక పోరాటాలు నిర్వహించినప్పటికీ ప్రభు త్వాలు స్పందించక పోవడం శోచనీయమన్నారు. అధికారం లోకి వచ్చిన వారం రోజులకే సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిపిఎస్ స్థానంలో జిపిఎస్ అనే కొత్త పెన్షన్ విధానం ప్రవేశపెట్టడం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసగించడమేనన్నారు. ఈ నేపథ్యంలో పాత పెన్షన్ న్యాయమైన డిమాండ్ సాధన కోసం యుటిఎఫ్ మరో పోరాటానికి సిద్ధమయ్యిందన్నారు. ప్రజా మద్దతు కూడ గట్టేందుకు ప్రజల్లోకి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. 7వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పాఠశాలల్లో ఓట్ ఫర్ ఓపిఎస్ గోడపత్రులు అంటించి ప్రచారం చేస్తామన్నారు. ఫిబ్రవరి 12 నుండి 15 వరకు అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర కార్యాలయాలకు కార్డు క్యాంపెయిన్, మరియు రాజకీయ పార్టీల మండల స్థాయి నాయకులకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. 25 నుండి 28 వరకు జిలా స్థాయి రాజకీయ నాయకులకు వినతి పత్రాలు ఇవ్వటం మార్చి 15 నుండి 30 వరకు నియోజకవర్గాలలో అన్ని పార్టీల అభ్యర్థులకు వినతులు బహిరంగ చర్చా వేదికలు నిర్వహిస్తామని తెలిపారు. అన్ని నియోజక వర్గాలలో ద్విచక్ర వాహన ర్యాలీలు చేపడతామన్నారు. పాత పెన్షన్ సాధిస్తామని, ఒపిఎస్ అమలు చేస్తామన్నవారికే ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని తెలిపారు. పొరుగు రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో పాత పెన్షన్ ఇస్తామన్న వారే అధికారాన్ని చేపట్టారని ఆయా రాజకీయ పార్టీల నాయకులు గ్రహించాలన్నారు. గోడ ప్రతుల ఆవిష్కరణ అనంతరం పట్టణంలోని అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో గోడ ప్రతులను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు మద్దుకూరి మోహనరావు, ఏ భాగేశ్వరి దేవి, జిల్లా గౌరవ అధ్యక్షులు కె. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు టి వెంకటేశ్వర్లు, కె.ఉషా సౌరిరాణి, రాష్ట్ర కౌన్సిలర్లు షేక్ కాసిం పీరా, ఎం. సుందరరావు, ఆడిటర్లు జి ఆంజనేయులు, వై శ్రీనివాసరావు, ఎస్ శివయ్య, ఎం వలి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం

నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కొండా సంజీవరావు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా యువత ఉపాధి మార్గాలు అందిపుచ్చుకునేలా శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. నిరుద్యోగ యువతపై ప్రత్యేక శ్రద్ధ వహించి నైపుణ్యం పెంపొందించడం వత్తి విద్య కోర్సుల్లో ఉచితంగా శిక్షణ కొనసాగుతుందన్నారు. ఈ నెల 20న విజయవాడలో పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, గుంటూరు,బాపట్ల,పల్నాడు జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు రీజనల్ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. జాబ్ నిరుద్యోగ యువత జాబ్ మేళాలో యువత పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ శాఖా పరమైన పలు అంశాలను వివరించారు.

- 6 నియోజకవర్గాల్లో స్కిల్ హబ్‌లు
- పార్లమెంట్ స్థాయిలో స్కిల్ కళాశాల
- ప్రజాశక్తితో పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కొండా సంజీవరావు

నిరుద్యోగ యువతకు ఎలాంటి శిక్షణ ఇస్తున్నారు?

డిగ్రీ చదువుతున్న యువతకు వ్యవహార శైలి, కమ్యూనికేషన్ స్కిల్స్,సమయ పాలన, అర్థమెటిక్, రీజనింగ్, కంప్యూటర్ డేటా ఎంట్రీ, అకౌంటెంట్, ఎగ్జిక్యూటివ్, ఎలక్ట్రానిక్స్,డ్రైవింగ్ పోస్టులకు ఉపయోగపడే శిక్షణ ఇస్తున్నాం. మహిళలకు కుట్టు, అల్లికలు, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు, తదితర ఉపాధి మార్గాలపై శిక్షణ ఇస్తాం.

శిక్షణ ఎక్కడ ఇస్తారు? ఎవర్ని సంప్రదించాలి?

నియోజకవర్గ స్థాయిలో పల్నాడులోని 7 నియోజకవర్గాలలో 6 నియోజకవర్గాలలో స్కిల్ హబ్ ల ద్వారా శిక్షణ ఇస్తున్నాం. మాచర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాల, సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నరసరావుపేటలో కలెక్టర్ కార్యాలయ సమీపంలోని నాక్ సెంటర్లో శిక్షణ ఇస్తున్నాం. చిలకలూరిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఆ నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేయలేక పోయాం. పార్లమెంటు స్థాయిలో కోటప్పకొండ డిఆర్డిఏ జిల్లా కార్యాలయ శిక్షణ కేంద్రం ఉంది. నియోజకవర్గస్థాయిలో రెసిడెన్షియల్ విధానం కొనసాగుతుంది. కళాశాల స్థాయిలో ఉచిత వసతి, భోజనం ఏర్పాటు చేశాం. నెలకు ఒక నియోజకవర్గం చొప్పున ప్రతి నెల 4వ శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నాం.

ఎంతమందికి ఉపాధి అవకాశాలు కల్పించారు?

పల్నాడు జిల్లా ఏర్పడ్డాక 13 మెగా జాబ్ మేళాలు ద్వారా 2483 మంది, 16 మినీ జాబ్ మేళాలు ద్వారా 296 మంది నిరుద్యోగ యువతకు, పార్లమెంట్ స్థాయిలో ఏర్పాటు చేసిన స్కిల్ కళాశాలలో 120 మంది నిరుద్యోగ యువతకు ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇవ్వగా 67మంది నిరుద్యోగ యువతకు వివిధ ప్రయివేటు రంగాలలో ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. మరో 30 మంది అభ్యర్థులు శిక్షణలో ఉన్నారు. అదేవిధంగా పల్నాడు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ లలో 500 మంది నిరుద్యోగ యువత శిక్షణ పొందుతుండగా 273 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించగా 227 మంది శిక్షణలో ఉన్నారు. మొత్తంగా 3119 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వచ్చాయి.

శిక్షణ ఎవరు ఇస్తారు?

జిల్లాలో టెక్నికల్ ట్రైనర్ దరఖాస్తులు పరిశీలించి ఆయా రంగాలకు సంబంధించి రాష్ట్ర ట్రైనింగ్ సెంటర్ కు సమాచారం అందజేస్తారు. రాష్ట్ర సెంటర్ నుండి ట్రైనర్ లు వచ్చి తరగతులు నిర్వహిస్తారు. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల యాజమాన్యం సైతం తమను సంప్రదిస్తే ట్రైనర్లు కొన్ని రోజులపాటు కళాశాలలో ఉండి ఉపాధి రంగాలపై శిక్షణ ఇస్తాం.

సెల్ ఫోన్, టీవీ మెకానిజంపై శిక్షణ ఇస్తున్నారా?

సెల్ ఫోన్, టీవీ మెకానిజం శిక్షణ గురించి యువత ఎవరు తమరు సంప్రదించలేదు. ఎవరైనా సంప్రదిస్తే ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి తప్పకుండా శిక్షణ ఇస్తాం. సాధ్యమైనంత ఎక్కువమంది నిరుద్యోగ యువతను సమీకరించి ఉపాధి అవకాశాలు పట్ల అవగాహన కల్పిస్తాం.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా